క్లుప్తంగా

ఘనంగా మదుగులమ్మ తీర్థం



ప్రత్యేక అలంకరణలో మదుగులమ్మ

బిక్కవోలు: బిక్కవోలు గ్రామదేవత మదుగులమ్మ తీర్థ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కుబడులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, భజనా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

పెదపూడి: మండలంలో బీసీ, ఈబీసీ కేటగిరీకి చెందిన వారు ప్రభుత్వ రుణం పొందుటకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి తెలిపారు. ఆయన గురువారం పెదపూడిలో మాట్లాడుతూ 2024–2025 సంవత్సరానినికి సంబంధించి ఈ నెల 13 నుంచి 22వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరణ జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ వెబ్ అడ్రస్ ఏపీఓబీఎంఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అవసరమైన వివరాలకు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఆయన వెంట ఈఓపీర్డీ ఎం.సత్యనారాయణ రెడ్డి తదితరులు ఉన్నారు.

లింగారెడ్డికి పీహెచ్‌డీ



లింగారెడ్డికి పీహెచ్‌డీ అందజేస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని పరీక్షల నిర్వహణ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్.లింగారెడ్డి కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం నుంచి పీహెచ్‌డీ పట్టాను వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ నుంచి గురువారం అందుకున్నారు. ఏపీలో ఎంపిక చేసిన జిల్లాలలో హ్యూమన్ రీసోర్స్ అనలిటిక్స్ అండ్ టీచర్స్ పెర్ఫార్మెన్స్ విత్ రెస్పెక్ట్ టు హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్‌పై చేసిన పరిశోధనకు ఈ పీహెచ్‌డీ లభించింది. ఇందుకు గైడ్‌గా అధ్యాపకులు డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్, కో గైడ్‌గా సీతానగరం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు వ్యవహరించారు.

ఆహార కమిషన్ సభ్యుడు కిరణ్ పర్యటన

పెదపూడి: ప్రధాన మంత్రి మాతృ వందన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ అన్నారు. అనపర్తి గ్రామంలో ఆయన గురువారం పర్యటించారు. అక్కడి నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్‌షాపులు, స్థానిక ఏరియా ఆస్పత్రి, పాఠశాలలు సందర్శించారు. ప్రభుత్వ పథకాలు అమలవుతున్న విధానాన్ని పరిశీలించారు. ప్రధాన మంత్రి మాతృ వందన పథకంలో బాలింతలకు ఇస్తున్న రూ.5 వేలపై అవగాహన కల్పించారు. ఆయా కేంద్రాల్లో ఉన్న సమస్యలపై మొదటి హెచ్చరికగా షోకాజ్ నోటీసులు ఇచ్చామని ఆయన తెలిపారు.

ఎక్సైజ్ స్టేషన్ సందర్శన



రికార్డులను తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్ చైతన్య మురళి

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలోని ఎక్సైజ్ స్టేషన్‌ను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వై.చైతన్య మురళి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సీఐ సుధ, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

15న మహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



సంకల్ప పూజలు చేస్తున్న భక్తులు

పెదపూడి: పెదపూడిలో పునర్నిర్మించిన మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. దీంతో భాగంగా గురువారం ఆలయం వద్ద సంకల్ప పూజలు జరిపారు. శనివారం ఉదయం 10.29 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ, అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

కొండంత శోభ..

- వైభవంగా నరసన్న ఉత్సవాలు
- కోరుకొండలో ఆధ్యాత్మిక శోభ
- ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాల వెలుగులు
- పెద్ద సంఖ్యలో తరలివస్తున్న భక్తులు

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 9వ తేదీన ప్రారంభమైన ఉత్సవాలు 15 వరకూ జరగనున్నాయి. ఉత్సవాల నేపథ్యంలో కోరుకొండలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఊరంతా గోవింద, హరినామస్మరణతో మార్మోగుతోంది. మన జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తున్నారు. స్వామివారిని దర్శించుకుని, మొక్కుబడులు తీర్చుకుంటున్నారు. ఉత్సవాల్లో భాగంగా లక్ష్మీనరసింహస్వామి గురువారం రాత్రి గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే ఈ నెల 10న రథోత్సవం, రాత్రికి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగాయి.

రంగనాథస్వామి కల్యాణోత్సవం

కోరుకొండలోని శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి కల్యాణోత్సవం గురువారం వైభవంగా జరిగింది. పండితుడు పెదపాటి నరసింహ గిరిధర్ ఆధ్వర్యంలో వేడుకగా నిర్వహించారు. గొట్టుముక్కల అన్నమాచార్యులు అల్లుడు రమణ ఉత్సవాలను ఏటా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఉదయం నుంచి రాత్రి వరకూ ప్రత్యేక పూజలు జరిగాయి.

అలరిస్తున్న కళా ప్రదర్శనలు


ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. గురువారం నిర్వహించిన కూచిపూడి నృత్యం అలరించింది. తీర్థం రెండో రోజు మంగళవారం నుంచి చివరి రోజు వరకూ కూచిపూడి నృత్య ప్రదర్శన జరుగుతోంది.

విద్యుత్ వెలుగులు

ఉత్సవాల సందర్భంగా స్వామివారి దేవస్థానానికి ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల వెలుగులు ఆకట్టుకుంటున్నాయి. దిగువ నుంచి కొండపైకి విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు.



రెడ్డి పంతులు సత్రంలో భోజన వితరణ



కోరుకొండలోని లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు



కొండపైకి వెళ్లే మెట్ల దారిలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు

సేవకు చిరునామాగా రెడ్డిపంతులు సత్రం

కోరుకొండలోని రెడ్డి పంతులు సత్రం సేవకు చిరునామాగా నిలిచింది. 1918లో రెడ్డి పంతులు దీన్ని ఏర్పాటు చేశారు. నాటి నుంచి నేటి వరకూ నరసింహస్వామి ఉత్సవాల్లో భక్తులకు ఐదు రోజుల పాటు భోజన వితరణ చేస్తున్నారు.

బెంచీ తీయమంటే.. మెట్లు తొలగించారు



బిక్కవోలులో అక్రమ్ బాషా ఇంటి మెట్లకు అడ్డుగా పెట్టిన బెంచీ



బెంచీతో పాటు మెట్లను కూడా తొలగిస్తున్న సిబ్బంది

బిక్కవోలు: రాకపోకలు సాగించడానికి వీలు లేకుండా గుమ్మానికి అడ్డుగా పెట్టిన సిమెంట్ బెంచీని తొలగించాలంటూ అధికారులకు మొరపెట్టుకుంటే.. ఏకపక్షంగా బెంచీతో పాటు ఇంటి మెట్లను కూడా తొలగించారు. దీంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. బిక్కవోలు కొత్తపేటలో నివాసం ఉంటున్న అక్రమ్ బాషా ఇంటి ముందు ఇద్దరు పాస్టర్లు, కొంత మంది వ్యక్తులతో కలిసి గత నెల 15వ తేదీన సిమెంట్ బెంచీని అడ్డంగా పెట్టారు. దాన్ని తొలగించాలంటూ బాషా స్థానిక అధికారులతో పాటు కలెక్టర్, జిల్లా ఎస్పీలకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే బుధవారం సాయంత్రం ఆకస్మికంగా వచ్చిన పంచాయతీ కార్యదర్శి తన సిబ్బందితో బెంచీని తొలగించారు.

దాని వెనుక ఉన్న మెట్లను కూడా తొలగిస్తుండగా బాధితులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినా విచారణ కూడా చేయకుండా స్థానికులు ఫిర్యాదు చేశారంటూ ఇంట్లోకి వెళ్లే మెట్లను తొలగించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రోజాను వివరణ కోరగా. .ఇరు వర్గాల ఫిర్యాదును పరిశీలించిన తర్వాత సమస్య పరిష్కారం కోసం సిమెంట్ బెంచీ, మెట్లను తొలగించామన్నారు.

ముగిసిన బైబిల్ మిషన్ మహాసభలు



ముగింపు సభలో మాట్లాడుతున్న షారోన్ కుమార్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని మార్గాని ఎస్టేట్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న బైబిల్ మిషన్ 58వ మహాసభలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు లండన్‌కు చెందిన రెవరెండ్ సలోమి సుకేష్ మొదటి సందేశం అందించారు. బైబిల్ మిషన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఆర్‌జీ ఇమ్మానుయేలు రాజు రెండో సందేశమిచ్చారు. మహాసభల కో కన్వీనర్ సుదర్శన్ షారోన్ మూడో సందేశం అందిస్తూ దైవ సన్నిధి చేసి దైవ ప్రసన్నత అందరూ పొందాలన్నారు. మహాసభల కన్వీనర్ ఏజే షారోన్ కుమార్ మాట్లాడుతూ ప్రజలందరూ విభేదాలు, వివాదాలు మాని సహనంతో మెలగాలన్నారు. మూడో రోజు భక్తులకు మధ్యాహ్నం భోజనంగా వెజిటెబుల్ బిర్యానీని మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ అందజేశారన్నారు. మార్టిన్, అగస్టస్, విజయరాజ్, జీవరత్నం, లావేటి సుదర్శనరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యుత్ ఉత్పత్తి కేంద్రం మాకొద్దు

- కాపవరం గ్రామస్తుల తీర్మానం
- అధికారులకు కాపీల అందజేత



బిక్కవోలు తహసీల్దార్‌కు గ్రామ సభ తీర్మానాన్ని అందిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీలు

బిక్కవోలు: చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే కేంద్రం మాకొద్దు అంటూ కాపవరం గ్రామస్తులు స్పష్టం చేశారు. ఆ గ్రామంలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనను నిరసిస్తూ గ్రామస్తులు చేసిన తీర్మానం కాపీలను గురువారం తహసీల్దార్ బి.కృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్‌లకు అందించినట్లు కాపవరం సర్పంచి సత్యంశెట్టి వెంకట రమణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి చెత్తను తీసుకువచ్చి, మా గ్రామంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తామంటే ఒప్పుకునేది లేదన్నారు. ఈ విషయంలో గ్రామస్తులందరం ఒకే మాట మీద ఉన్నామన్నారు. ఈ నెల 10వ తేదీన కాపవరంలో గ్రామ సభ ఏర్పాటు చేస్తే, అక్కడి టెంట్లు, కుర్చీలను అధికారులు, పోలీసులు బలవంతంగా తీసి వేయించారన్నారు. అయితే గ్రామ సభ తీర్మానం ద్వారా ఆమోదించి మండల అధికారులు ఇవ్వడం జరిగిందన్నారు. ఇదే కాపీలను జిల్లా అధికారులకు కూడా ఇస్తున్నామని తెలిపారు. కాపవరం గ్రామాన్ని కాపాడుకునేందుకు గ్రామ ప్రజలతో కలిసి ఎంతటి ఉద్యమం చేయడానికి అయినా వెనకాడేది లేదన్నారు. కార్యక్రమంలోని ఎంపీటీ మార్శెల్ల భీష్ముడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీవాణీధర రామన్

రాజానగరం: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీవాణీధర రామన్ అన్నారు. స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లోని మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం, ఎమ్మెస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ (విశాఖపట్నం) సహకారంతో గురువారం నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పారిశ్రామిక ప్రగతిని వేగవంతం చేసేందుకు పథకాల అమలులో తాజాగా వచ్చిన మార్పులను వివరించారు. ఎంఎస్ఎం ఈటెక్నాలజీ సెంటర్ (విశాఖపట్నం) ప్రిన్సిపాల్ ఆచార్య కె.మురళీకృష్ణ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనపై అవగాహన పెంచుకోవడంతో పాటు ప్రాజెక్టుల కొలాబరేషన్స్ గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సీతానగరం: ముగ్గళ్ల వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. రఘుదేవపురానికి చెందిన ఎం.కృష్ణ చైతన్య హైదరాబాద్‌లో ఉంటున్నారు. సొంత గ్రామానికి వచ్చిన ఆయన పని మీద రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి వస్తూ ముగ్గళ్ల వద్ద రోడ్డు పక్కనే ఆగి ఉన్న ఆటోను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో చైతన్య తలకు బలమైన గాయమైంది. స్థానికులు అంబులెన్స్‌లో రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

పాన్‌షాపులో చోరీ

సీతానగరం: వెదుళ్లపల్లికి చెందిన గారపాటి శ్రీనివాస్ పాన్ షాపులో బుధవారం రాత్రి దొంగతనం జరిగింది. రాత్రి 10 గంటల సమయంలో అతడు షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. దొంగలు ఆ తాళం బద్దలు కొట్టి రూ 2,500 విలువైన సరకు, రూ.500 చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై రామ్ కుమార్ గురువారం కేసు నమోదు చేశారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

సీతానగరం: మండలంలోని వంగలపూడి ఏటిగట్టుపై పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. వివరాల్లోకి వెళితే.. రఘుదేవపురానికి చెందిన ప్రైవేటు స్కూల్ వంగలపూడి ఏటిగట్టుపై నుంచి వస్తోంది. ఆ బస్సును ఓ ఇసుక లోడు లారీ ఓవర్ టేక్ చేసింది. ఆ సమయంలో స్కూల్ బస్సును రాసుకుంటూ లారీ ముందుకు దూసుకుపోయింది. ఈ ఘటనలో స్కూల్ బస్సు ఏటిగట్టు అంచువరకూ వెళ్లి నిలిచింది. దానిలోని 40 మంది విద్యార్థులు భయంతో కేకలు వేశారు. స్థానికులు వచ్చి బస్సు నుంచి పిల్లలను కిందకు దింపారు. స్కూల్ యాజమాన్యం ఫిర్యాదు మేరకు పోలీసులు ఆ ఇసుక లారీని స్టేషన్‌కు తరలించారు. స్కూల్ బస్సు ఏటిగట్టు మీద నుంచి కిందకు పడితే పెను ప్రమాదం జరిగేది.

ప్రసన్న వేంకటేశ్వరస్వామికి పూజలు



జీయర్ స్వామికి వేంకటేశ్వరుని చిత్రపటం అందజేసిన కమిటీ సభ్యులు

బిక్కవోలు: బలభద్రపురంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని భాష్యకార సిద్ధాంత పీఠాధిపతి త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి, తన శిష్యబృందంతో గురువారం సందర్శించారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జీయర్‌స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏటా ఆలయంలో జరిగే కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. వరహస్వామి ఆలయంతో పాటు పలు ఆలయాలను పరిశీలించారు. అనంతరం కమిటీతో మాట్లాడుతూ ఆలయాన్ని అద్భుతంగా నిర్మించారన్నారు. కార్యక్రమంలోని కమిటీ సభ్యులు నల్లమల్లి రామచంద్రారెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనధికార కట్టడాల క్రమబద్ధీకరణ

బిక్కవోలు: అభ్యంతరం లేని ప్రభుత్వ పోరంబోకు స్థలాల్లో అనధికారికంగా నిర్మించిన పక్కా ఇంటి నిర్మాణాలను క్రమబద్ధీకరిస్తున్నట్లు తహసీల్దార్ బి.కృష్ణ తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ 2025 జనవరి 29న రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 30 ప్రకారం 2019 అక్టోబర్ 15 కంటే ముందుగా బిక్కవోలు మండలంలో అభ్యంతరం లేని ప్రభుత్వం పోరంబోకు స్థలాల్లో అనధికారికంగా నిర్మించిన పక్కా ఇంటి నిర్మాణాలు చేపట్టిన వారి ఇళ్లను ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తుందన్నారు. యజమానులు ఇంటి పన్ను, విద్యుత్ బిల్లులతో తమ గ్రామ సచివాలయలల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 150 చదరపు గజాల్లో నిర్మించిన ఇంటిని ఉచితంగా క్రమబద్ధీకరిస్తామన్నారు. పూర్తి వివరాలకు సచివాలయాల్లో రెవెన్యూ అధికారులను సంప్రదించాలని కోరారు.

గృహ నిర్మాణాలకు అదనపు ఆర్థిక సాయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేంద్రరెడ్డి

పెదపూడి: ఎస్సీ, ఎస్టీ, బీసీ గృహ నిర్మాణ లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం అందజేస్తుందని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ, హౌసింగ్ శాఖలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనంగా ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. మండల పరిధిలో 348 గృహ నిర్మాణాలు వివిధ స్థాయిల్లో ఉన్నాయన్నారు. లబ్ధిదారుల్లో ఎస్టీలు ఏడుగురు, ఎస్సీలు 85 మంది, బీసీలు 256 మంది ఉన్నారని, వారందరికీ ఈ అదనపు సహాయం అందుతుందన్నారు. గృహ నిర్మాణాలను మే 31 నాటికి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ పీవీ సీతాపతిరావు, హౌసింగ్ ఏఈ శ్రీనివాసు, ఈఓపీఆర్డీ మేడపాటి సత్యనారాయణరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ లంక వెంకటేశ్వరరావు, సచివాలయం కార్యదర్శులు, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 36 మంది గైర్హాజరు

రంగంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో గురువారం ఇంటర్ మొదటి సంవత్సరం కెమిస్ట్రీ పేపర్–1, కామర్స్ పేపర్–1 పరీక్షలు జరిగాయి. ఈ కాలేజీలోని ఏ, బి సెంటర్లలో మొత్తం 715 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, ఏ సెంటర్‌లో 22 మంది, బి సెంటర్‌లో 14 మంది గైర్హాజరు అయ్యారు.

పరిమితికి మించి పురుగు మందులు వాడొద్దు



దోమాడలో వరిని ఆశించిన అగ్గి తెగులును గుర్తిస్తున్న అధికారులు, రైతులు

పెదపూడి: వరి పంటకు అవసరమైన మేరకే పురుగు మందులు పిచికారీ చేయాలని మండల వ్యవసాయ శాఖాధికారి టీవీఆర్ మణిదీప్ రైతులకు సూచించారు. దోమాడలో గురువారం పొలంబడి శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రబీ పంట ఆశాజనకంగా ఉందని, అధిక ఉష్ణోగ్రతలు కారణంతో తెగుళ్లు అంతగా ఆశించడం లేదన్నారు. అక్కడక్కడ అగ్గి తెగులు ఉందని, దీని నివారణకు 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ 75 శాతం లేదా 1.5 ఎమ్మెల్ ఐసోప్రోత్సహిలైన్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే మెడవిరపు లక్షణాల నివారణ కోసం లీటర్ నీటికి 2.5 ఎంఎల్ కాసుగా మైసిన్ కలిపి చల్లాలన్నారు. కార్యక్రమంలో రైతులు మద్దిపూడి దొరబ్బాయి. గ్రామ వ్యవసాయ సహాయకులు దేవగుప్తాపు శ్రీను, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సర్వాంగ సుందరంగా రెడ్ల రామాలయం

- రూ.80 లక్షలతో పునర్నిర్మాణ పనులు
- రేపటి నుంచి ప్రతిష్ఠా మహోత్సవాలు

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని రెడ్ల రామాలయం పునఃప్రతిష్ఠా మహోత్సవాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. దాతల సహకారంతో రూ.80 లక్షలతో సర్వాంగ సుందరంగా ఆలయాన్ని పునర్నిర్మించారు. శనివారం విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు మొదలవుతాయి. యాగశాల ప్రదక్షిణ, దీక్షా ధారణ, అఖండ దీపారాధన, నీరాజన మంత్రపుష్పములు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. 16న వాస్తుపూజ, క్షీరాభిషేకం, గ్రామోత్సవం, జలాదివాసం, ధాన్యాదివాసం, హోమాలు జరుగుతాయి. 17వ తేదీ ఉదయం 10.22 గంటలకు సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ మాజీ సర్పంచ్ కొవ్వూరి గోపాలకృష్ణారెడ్డి, కరుణావతి దంపతులు, కుటుంబ సభ్యులు నిర్వహిస్తారు. ధ్వజస్తంభం ప్రతిష్ఠను పడాల సుబ్బిరెడ్డి, రజని దంపతులు, కుటుంబ సభ్యులు, శిఖర ప్రతిష్ఠను గొలుగూరి సత్తి రెడ్డి, పద్మావతి, గొలుగూరి కృష్ణారెడ్డి, దేవి దంపతులు నిర్వహించనున్నారు. దేశంలోని 12 నదుల నుంచి జలాలను తీసుకువచ్చి విగ్రహాలకు జలాదివాసం చేయనున్నారు.



పందలపాకలో పునర్నిర్మించిన రెడ్ల రామాలయం

దాతల సహకారం మరువలేనిది



దాతల సహకారంతో రెడ్ల రామాలయం నిర్మాణం చేయడం, విగ్రహాల ప్రతిష్ఠలో మా కుటుంబ సభ్యులు భాగం కావడం చాలా ఆనందంగా ఉంది. స్వామివారికి అభిషేకం చేయించడానికి మిత్రుల సహకారంతో 12 నదుల జలాలను తీసుకువచ్చారు. ఆలయ అభివృద్ధికి సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు.

– కొవ్వూరి గోపాలకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్, పందలపాక

పూర్తయిన ఏర్పాట్లు



ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. కమిటీ సభ్యుల సహకారంతో శరవేగంగా చేపడుతున్నాం. రూ.80 లక్షల వరకూ దాతలు సహకారం అందించారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం భారీ ఎత్తున అన్నసమారాధన ఏర్పాటు చేశాం.

– పడాల సుబ్బిరెడ్డి, ఆలయం అభివృద్ధి కమిటీ ఛైర్మన్, పందలపాక

జాతీయ సదస్సులో విద్యార్థుల ప్రతిభ

కంబాలచెరువు: రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఒక్క రోజు జాతీయ సదస్సులో ఆర్ట్స్ కళాశాల రాజనీతి శాస్త్రం విద్యార్థులు అద్భుత ప్రతిభను కనపరిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే గురువారం తెలిపారు. ఎం. తోష అనే విద్యార్థిని సింధూ నాగరికత పరిపాలనలో మతం పాత్ర పరిశోధన పత్రంపై వివరణ ఇచ్చిందన్నారు. సీహెచ్.అఖిల, నూర్జహాన్, జె.రమేష్, కె.వాణి, సూర్యచంద్ర, కె.సంధ్య, లావణ్య, వి.ప్రవల్లిక భారత పరిపాలనాచరిత్ర లోని వివిధ అంశాలపై పోస్టర్ ప్రెసెంటేషన్ ప్రతిభవంతంగా చేసి అందరి మన్ననలు అందుకున్నారన్నారు. వీటిలో నూర్జహాన్‌కు ప్రథమ స్థానం, నగదు బహుమతి లభించాయన్నారు. సదస్సులో రాజనీతిశాస్త్రం విభాగాధిపతి డాక్టర్ బాబ్జీ, డాక్టర్ కస్తూరి సీతామహాలక్ష్మి, కేపీబీఎల్ సరోజ, రామారావు, రామకృష్ణ, తులసి కుమారి పరిశోధనా పత్రాలను సమర్పించారన్నారు.